సాక్షి జనగామ

శనివారం | 10 | జూన్ | 2023



రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. - 8లో▸



ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42^0/28^0

జిల్లాలో ఉదయం పొడివాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఐక్య ఉద్యమాలు చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ వర్గీకరణ కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గోవిందు ఇసాక్ అధ్యక్షతన శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగలు చేస్తున్న ఉద్యమం కీలక దశకు చేరిందని, పాలకుల నిర్లక్ష్యంతో వర్గీకరణ బిల్లు ఆలస్యమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గంగారపు శ్రీనివాస్, తాళ్లపెల్లి కుమార్, సందెన రవీందర్, చాడ ఏలియా, నలిమెల నాగరాజు, బొడ్డు శాంతిసాగర్, గాదె శ్రీధర్, రడపాక ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

జనగామ రూరల్: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామరస్యంగా పరిష్కరించుకోదగిన చెక్‌బౌన్స్, క్రిమినల్, సివిల్ తగాదాలు, కుటుంబ వ్యవహారాలు, మోటార్ వెహికిల్, చిట్‌ఫండ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ఈ వేదికపై పరిష్కరించుకోవాలని సూచించారు.

విధుల్లో చేరిన ప్రొఫెసర్లు



జనగామ: జిల్లా మెడికల్ కళాశాలలో 56 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ రెసిడెన్సీ ప్రోగ్రాం ఎస్ఆర్‌లు శుక్రవారం విధుల్లో చేరారు. వీరికి డిపార్ట్‌మెంట్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఆర్ఎంఓలు డాక్టర్ శంకర్, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

జనగామ రూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సూర్యాపేటరోడ్డులోని భ్రమరాంబ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇరిగేషన్, పీఆర్, ఆర్అండ్‌బీ, మిషన్‌భగీరథ, ఆరోగ్య, విద్యుత్, రెవెన్యూ శాఖల ప్రగతి, ప్రజలకు అందించే సేవలను ఫ్లెక్సీల్లో ప్రదర్శించాలని తెలిపారు.

పీహెచ్‌డీ దరఖాస్తుల స్క్రూటినీ షురూ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, లా, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్ విభాగాల పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షరాసి అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పటికే సంబంధిత డీన్లకు దరఖాస్తు చేసిన విషయం విదితమే. ఆయా దరఖాస్తులను స్క్రూటినీ చేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. సైన్స్ డీన్ మల్లారెడ్డి విభాగాల అధిపతులకు దరఖాస్తులను పంపగా స్క్రూటినీ చేస్తున్నారని సమాచారం. మిగిలిన విభాగాల డీన్లు కూడా ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది.

19నుంచి నిట్‌లో జోసా అడ్మిషన్లు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో మొదటి సంవత్సరం ప్రవేశానికి జోసా ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) ద్వారా బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ ద్వారా చాయిస్ ఫిల్లింగ్‌ను ప్రారంభిస్తారు. ఈనెల 19 నుంచి జూలై 31 వరకు జోసా అడ్మిషన్లు కొనసాగనున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రులకు వారి వృత్తిలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 30వ తేదీలోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శివునిపల్లి ప్రాథమిక పాఠశాలలో కూల్చివేసిన తరగతి గదులు



సాక్షి పరిశీలన

పక్క ఫొటోల్లో కనిపిస్తున్నది స్టేషన్‌ఘనపూర్ మండలం కేంద్రంలోని శివునిపల్లి ప్రాథమిక పాఠశాల. ఐదు తరగతుల్లో 80 మంది విద్యార్థులు ఉన్నారు. 'మనఊరు–మనబడి' కింద ఎంపికైన ఈ స్కూల్ నూతనంగా నిర్మాణం చేపట్టడానికి పాత గదులను కూల్చి వేశారు. ఏడాది గడిచిపోతున్నా పనులు మొదలు పెట్టలేదు. మధ్యాహ్న భోజన డైనింగ్‌హాల్, టాయిలెట్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపి వేశారు. ఈ మండలంలో 12 పాఠశాలలు ఎంపిక కాగా.. రెండు మాత్రమే ప్రారంభమయ్యాయి. మిగతా వాటిలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

- స్టేషన్‌ఘన్‌పూర్

ఎక్కడి పనులక్కడే..!

సర్కారు స్కూళ్లలో కొనసా...గుతున్న 'మనఊరు-మనబడి' పనులు

- ఎంపిక చేసిన పాఠశాలలు 176
- 17 స్కూళ్లు ప్రారంభం.. మరో 29 ప్రారంభానికి సిద్ధం
- మిగతా 130లో చాలా వరకు మొదలు కాని పనులు
- రెండు రోజుల్లో మోగనున్న బడి గంట..

సర్కారు స్కూళ్లను మరింత బలోపేతం చేసి కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మనఊరు-మనబడి' కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. వేసవి సెలవులు ముగించుకుని మరో రెండు రోజుల్లో బడులు తెరుచుకోనున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో సర్కారు, దాతల సాయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి. కొన్ని స్కూళ్లలో పూర్తి కాగా.. చాలా వరకు పాఠశాలల్లో ఇంకా మొదలే కాలేదు. కూలిపోవడానికి సిద్ధంగా వరండా పైకప్పులు.. అపరిశుభ్రమైన పరిసరాలు.. దుమ్మూ ధూళితో నిండిన తరగతి గదులు వెక్కిరిస్తున్నాయి.

- జనగామ

176 పాఠశాలల ఎంపిక

జిల్లాలో 103 ఉన్నత, 64 ప్రాథమికోన్నత, 241 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. వీటిలో 38వేల పైచిలుకు మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 'మనఊరు-మనబడి' కార్యక్రమం కింద 176 పాఠశాలలను ఎంపిక చేసి సివిల్ పనుల కోసం రూ.54 కోట్లు కేటాయించారు. టాయిలెట్లు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్ల నిర్మాణం ఈజీఎస్ ద్వారా చేపడుతున్నారు. ఇప్పటి వరకు 17 చోట్ల పనులు పూర్తయి స్కూళ్ల ప్రారంభించగా.. మరో 29 స్కూళ్ల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 130 పాఠశాలల పరిధిలో కొన్ని వందశాతం పనులు మొదలు కాలేదు. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

50 శాతమూ పూర్తి కాలేదు..



ఇటికాలపల్లిలో అధ్వానంగా కుళాయిలు

బచ్చన్నపేట: మండలంలో 17 పాఠశాలలు ఉండగా.. ఇటికాలపల్లి ప్రాథమిక పాఠశాల ఎంపిక చేశారు. పనులకు రూ.12 లక్షలు కేటాయించగా.. ఏడాది గడిచి పోతున్నా 50 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. పరిసరాలు అపరిశుభ్రంగానే ఉన్నాయి. కుళాయిలు కంపు కొడుతున్నాయి.

టెండర్ ప్రక్రియలో ఆలస్యం..



జిల్లాలో 'మనఊరు-మనబడి' కింద ఎంపికైన పాఠశాలల్లో ఇప్పటి వరకు 21 ప్రారంభమయ్యాయి. మరో 29 నూరు శాతం పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన చోట్ల 80శాతం పనులు పూర్తయ్యాయి. ఈనెల 21వ తేదీ వరకు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. టెండరు ప్రక్రియలో ఆలస్యం జరగడంతో నిర్మాణ పనుల్లో జాప్యం అయింది.

- కె.రాము, డీఈఓ, జనగామ

ఎర్రగొల్లపహాడ్ పాఠశాల ఆవరణలో కుప్పగా ఉన్న గన్నీ బ్యాగులు



అరకొర వసతులు..

జనగామ రూరల్: జనగామ మండలంలో మొత్తం 60 పాఠశాలలుండగా 'మనఊరు-మనబడి' కింద 12, అర్బన్‌లో 8 ఎంపిక చేశారు. సిద్దెంకి, వెంకిర్యాల, అర్బన్‌లోని గణేష్‌వాడ స్కూళ్ల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఎర్రగొల్లపహాడ్‌లో హైస్కూల్, యూపీఎస్ కలిసే ఉన్నాయి. 220 మంది విద్యార్థులకు 8 మంది టీచర్లు ఉన్నారు. 14 మంది అవసరం. మొత్తం పది తరగతి గదులు కూడా లేవు. కనీస సదుపాయాలు లేవు. యూపీఎస్ ఆవరణలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గన్నీ బ్యాగులను వదిలి వెళ్లారు.

కొనసా...గుతున్న పనులు

తరిగొప్పుల: మండల పరిధిలో 8 స్కూళ్లు ఎంపిక కాగా.. నర్సాపూర్ పీఎస్ ఒక్కటే ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్‌తోపాటు, అంకుషాపూర్ కమ్మరిపేట, అబ్దుల్‌నాగారం, జాలుబాయ్‌తండా పాఠశాలల్లో పనులు నేటికీ కొనసాగుతున్నాయి.

నత్తనడకన..

జఫర్‌గఢ్: మండలంలోని 38 పాఠశాలల పరిధిలో 11 పాఠశాలలు ఎంపిక చేశారు. తీగారం, తమ్మడపల్లి(జి) పాఠశాలలను ప్రారంభించగా, మిగతా చోట్ల పనులు అసంపూర్తిగానే ఉన్నా యి. తిమ్మంపేట పాఠశాలలో పనులు నత్తనడకన సాగుతున్నాయి.



తిమ్మంపేటలో అసంపూర్తి పనులు

పట్టాలెక్కలేదు..

చిల్పూరు: మండలంలో 42 పాఠశాలలు ఉండగా.. 3 ఉన్నత, 5 ప్రాథమిక, ఒక యూపీఎస్ ఎంపిక చేశారు. రెండు స్కూళ్లలో పనులు పూర్తి చేసి ప్రారంభించారు. మిగిలిన ఏడు పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. శ్రీపతిపల్లి ప్రాథమిక పాఠశాలలో నేటికీ పనులు పట్టా లెక్కలేదు.



శ్రీపతిపల్లి పీఎస్‌లో నిర్మాణం కాని టాయిలెట్లు

కోమల్లలో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగానే..

రఘునాథపల్లి: మండలంలో 62 పాఠశాలలు ఉండగా.. 21 స్కూళ్లను ఎంపిక చేశారు. మండలగూడెం, అశ్వరావుపల్లిలో నిర్మాణాలు పూర్తి కాగా.. మిగతా చోట్ల అసంపూర్తి పనులతో వదిలేశారు.

నాణ్యత పాటించడం లేదు



కోమల్ల ప్రాథమిక పాఠశాలలో మూడు అదనపు గదుల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేశారు. పనుల్లో ఏ మాత్రం నాణ్యత పాటించడం లేదు. ఇప్పటి వరకు పిల్లర్ల నిర్మాణం కూడా పూర్తి చేయలేదు.

- బొల్లపల్లి శ్రీనివాస్, కోమల్ల

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కేసీఆర్ లక్ష్యం

రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, గొల్ల కురుమలకు యూనిట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడత 15,042 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయగా రూ.263.32 కోట్ల వ్యయం అయిందని చెప్పారు.



సంక్షేమ పథకాల చెక్కు అందజేస్తున్న మంత్రి

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీపీఓ రంగాచారి, ఆర్‌డీఓ కృష్ణవేణి, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ పాల్‌సింగ్ పాల్గొన్నారు.

'సంక్షేమం'తో రాష్ట్రం సుభిక్షం

- సంక్షేమ సంబురాల్లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భ్రమరాంబ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంక్షేమ సంబురాల్లో ఆయన మాట్లాడారు. 2014కు ముందు నియోజకవర్గంలో 32,476 మందికి పింఛన్ ఇవ్వగా.. ప్రస్తుతం 47,319 మందికి అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచామన్నారు. సర్కారు విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాల పిల్లలకు నాణ్యతతోకూడిన స్నాక్స్, భోజనం అందిస్తున్నదని తెలిపారు. ప్రజా సంక్షేమం కోరే సీఎంను కాపాడుకోవాలన్నారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలలు గంటున్నారని, అది సాధ్యం కాదన్నారు. అనంతరం గొర్రెల యూనిట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, మహిళా సంఘాలకు, రజకులకు రుణాలు అందజేశారు. అంతకు ముందు బోనాలు, బతుకమ్మ ఆడారు. పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్ స్వరూప అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ సంబురాల్లో ఎమ్మెల్యే తదితరులు

ఆర్టీసీకి పూర్వ వైభవం

- విలేజ్ బస్సు ఆఫీసర్ల వ్యవస్థ ఏర్పాటు శుభపరిణామం
- ఏసీపీ దేవేందర్‌రెడ్డి

జనగామ: ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు విలేజ్ బస్సు ఆఫీసర్ల వ్యవస్థను తీసుకు రావడం శుభపరిణామమని ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. జనగామ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మేనేజర్ జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో మాదిరిగా ఆర్టీసీలో అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, తమ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. 'ఆర్టీసీ ప్రయాణం సురక్షితం' అనే నినాదాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లడతోపాటు సమయానుకూలంగా పల్లెలకు బస్సులు నడిచేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి విషయాన్ని సంస్థ ఉన్నతాధికారులకు తెలియజేస్తే పరిష్కారం దిశగా ఆలోచిస్తారని పేర్కొన్నారు. అనంతరం విలేజ్ ఆఫీసర్లుగా ఎంపికైన పి.రమేష్, కె.సురేందర్, కేఎస్.రావు, జేవైస్వామి, బీఐ.గిరి, ఎంఆర్.కృష్ణ, పీఎస్.రెడ్డి, జీఎస్.నారాయణ, ఎ.కృష్ణ, జె.శ్రీనివాస్‌లకు అవసరమైన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.రాఘవేందర్, ఎంఎఫ్ డి.హుస్సే న్, అసిస్టెంట్ మేనేజర్ వై.యాదమణిరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ యాదగిరి, హెడ్ కానిస్టేబుల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



విలేజ్ ఆఫీసర్లతో ఏసీపీ, పక్కన ఆర్టీసీ డీఎం

గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- 3,140 మంది అభ్యర్థులు.. 14 సెంటర్లు
- 10.30 నుంచి ఒంటిగంట వరకు పరీక్ష
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్.. 63039 28718 నంబర్‌లో సంప్రదించాలి
- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్‌తో కలిసి మాట్లాడారు. గ్రూప్–1 పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 14 సెంటర్లు కేటాయించామని 3,140 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని, సెంటర్‌లోకి 10.15 గంటల వరకే అనుమతి ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఇబ్బంది లేకుండా రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, చౌరస్తా ప్రధాన కూడళ్లలో రూట్ మ్యాప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పిస్తున్నామని, సెంటర్‌కు ఇద్దరు ఏఎస్ఎమ్‌లు ఉంటారని పేర్కొన్నారు. పరీక్ష హాల్‌లోకి వాటర్ బాటిల్‌తోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, షూస్, బెల్టులకు అనుమతి లేదని, ప్రతి రూంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక జిల్లా అధికారి, 11 మంది ఇన్విజిలేటర్లు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని పరీక్ష కేంద్రాల పేర్లు ఒకే రకంగా ఉన్నందున ఇబ్బంది పడకుండా సెంటర్లు చూసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్(6303928718)లో సంప్రదించాలని కోరారు. అలాగే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బ్లాక్ లేదా బ్లూ బాల్‌పాయింట్ పెన్ తెచ్చుకోవాలని, హాల్‌టికెట్‌పై ఫొటో రాని వారు అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలని చెప్పారు. గుర్తింపు కోసం ఆధార్ లేదా ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పరీక్ష నిర్వహణపై వీడియోకాన్ఫరెన్స్

గ్రూప్–1 పరీక్ష ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెంటర్ల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

గ్రూప్–1 పరీక్ష నిర్వహించే జనగామ పట్టణంలోని తేజస్విని జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల కేంద్రాలను కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో అధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



తేజస్విని జూనియర్ కళాశాల సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

సోమేశ్వరుడికి వెండి నాగపడిగ

పాలకుర్తి టౌన్: స్వయంభు చండికా సమేత శ్రీసోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి వారికి వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కొడాలి కొమురయ్య, ఐలమ్మ, రాజు, దీప్తి దంపతులు శుక్రవారం వెండి నాగపడిగ బహూకరించినట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. కేజీ 303 గ్రాముల మిశ్రమ వెండి(రూ.90 వేల విలువ)తో నాగపడిగ తయారు చేసినట్లు పేర్కొన్నారు.



వెండి నాగపడిగను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

రికార్డు కలెక్షన్

- ఆర్టీసీ జనగామ డిపోకు వరంగల్ రీజియన్‌లో 4వ స్థానం
- రెండు నెలల్లో రూ.94 లక్షల ఆదాయం
- బస్సుల్లో రోజుకు 42వేల మంది ప్రయాణం



బస్టాండులో ప్రయాణికుల రద్దీ

జనగామ: టికెట్ కలెక్షన్ల రూపంలో ఆర్టీసీ జనగామ డిపో మంచి ఆదాయం సమకూర్చుకుంటోంది. గత నెల నుంచి ఈనెల 14వ తేదీ వరకు శుభముహూర్తాలు ఉండడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. హైదరాబాద్, హనుమకొండ, సూర్యాపేట, ఉప్పల్, జగద్గిరిగుట్ట, సిద్దిపేట రూట్లలో రికార్డు స్థాయిలో టికెట్ కలెక్షన్లు వచ్చాయి. డిపో పరిధిలో 44 పల్లె వెలుగు, 5 మినీ పల్లెవెలుగు, 16 ఎక్స్‌ప్రెస్, 8 డీలక్స్, 5 ప్రైవేటు ఎక్స్‌ప్రెస్, 34 ప్రైవేటు పల్లె వెలుగు మొత్తం 113 బస్సు సర్వీసులు ఉన్నాయి.

వరంగల్ రీజియన్‌లో 4వ స్థానం

టికెట్ కలెక్షన్లలో ఈనెలలో జనగామ డిపో వరంగల్ రీజియన్‌లో 4వ స్థానంలో ఉంది. జూన్ ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు రోజువారీగా బస్సు సర్వీసులు 46,444 కిలోమీటర్ల మేర ప్రయాణించగా.. 42వేల మందిని వివిధ గ్రామాలకు వెళ్లారు. రోజువారీ టికెట్ కలెక్షన్ రూ.17లక్షల 560 రావాల్సి ఉండగా.. సరాసరి రూ.21లక్షల 50వేల వరకు వస్తోంది. శుక్రవారం నాటికి తొమ్మిది రోజుల కలెక్షన్ రూ.1కోటి 69 లక్షలు వచ్చింది. టార్గెట్‌కు మించి రూ.28,38,000 అదనంగా సమకూరాయి. మే నెలలో వరంగల్ రీజియన్‌లో 2వ స్థానంలో నిలిచిన జనగామ డిపో.. నెలవారీ కలెక్షన్ రూ.7కోట్ల 54లక్షలు వచ్చింది. టార్గెట్‌కు అదనంగా రూ.65.88లక్షల ఆదాయం సమకూరింది.

పక్కా ప్రణాళికతో ముందుకు..



టికెట్ కలెక్షన్లు తగ్గకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఈనెలలో ఇప్పటి వరకు టికెట్ కలెక్షన్‌లో జనగామ డిపో వరంగల్ రీజియన్‌లో 4వ స్థానంలో ఉంది. గత నెలలో 2వ స్థానంలో నిలిచింది. రెండు నెలల పేరిట రూ.94.26 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. ఏప్రిల్, మే నెలల్లో దివ్యాంగులకు 1,420 బస్ పాస్‌లు ఇవ్వగా, దీనిపై సబ్సిడీ రూపంలో డిపోకు రూ.85 లక్షలు రానున్నాయి.


- జ్యోత్స్న, డిపో మేనేజర్, జనగామ

ఉద్యోగుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఖాజా షరీఫ్

జనగామ: తెలంగాణ సాధన పోరాటంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యోగులు పండుగ జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో శనివారం జరిగే సుపరిపాలన దినోత్సవంలో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు సానం రాజనర్సయ్య, ఉపాధ్యక్షుడు సంపత్, ఉప్పలయ్య, పట్టణ అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి మధు, బచ్చన్నపేట తాలుకా అధ్యక్షుడు జిల్లా రవీందర్, పాలకుర్తి అధ్యక్షుడు చంద్రన్న పాల్గొన్నారు.



విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



షాపు యజమాని అరెస్టును చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు

వరంగల్ చౌరస్తా : దుకాణాదారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఏంఎస్ మల్లికార్జున దుకాణంలో సదానంద్ బీజీ–2 పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వెల్లడైంది. ఒక ప్యాకెట్ అసలు ధర రూ.853 కాగా.. రెండు ప్యాకెట్లను రూ.2100 అమ్ముతున్నారు. విత్తనాలు, పురుగు మందులను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా, మరో రకం పత్తివిత్తన ప్యాకెట్ అసలు ధర రూ.853 ఉండగా రెండు ప్యాకెట్లను రూ.2100కి అమ్ముతున్నారు. విత్తనాలను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని అక్కల మల్లికార్జున్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలను అమ్మాలని సీపీ సూచించారు.

ముగ్గురికి గ్రేడ్-3 కార్యదర్శులుగా పదోన్నతి

వరంగల్ : ముగ్గురు అసిస్టెంట్ సెక్రటరీలకు గ్రేడ్–3 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న జె. భాస్కర్‌కు గ్రేడ్–3 పదోన్నతి కల్పించి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. ఎ. షరీఫ్‌కు గ్రేడ్–3గా ఇక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మార్కెట్‌కు బదిలీ చేశారు. ఇక్కడే పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌కు గ్రేడ్ –3గా పదోన్నతి కల్పించి జనగామ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

మణుగూరు టు బెల్గావి ప్రత్యేక రైలు పునఃప్రారంభం

కాశిబుగ్గ: మూడో రైల్వే లైన్ పనులతో ఇటీవల నిలిపివేసిన మణుగూరు బెల్గావి ప్రత్యేక రైలు ఆదివారం సికింద్రాబాద్ నుంచి మణుగూరుకు పునఃప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు(07335) 11న ఉదయం 5.25కు సికింద్రాబాద్‌లో ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్‌కు 7.58 గంటలకు చేరుకుని కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, గాంధీపురం, భద్రాచలం రోడ్డు స్టేషన్‌లలో ఆగుతూ 12.50 గంటలకు మణుగూరుకు చేరుకుంటుంది. 12న 07336 రైలు మణుగూరులో 3.40 గంటలకు ప్రారంభమై స్టేషన్‌లలో అగు తూ వరంగల్‌కు 7.28, సికింద్రాబాద్‌కు 10.10 గంటలకు చేరుకుంటుదని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
బ్రైలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

నేషనల్ రోజ్ డే శుభాకాంక్షలు
చేనేత హస్తకళా ప్రదర్శన
కళా సిల్క్
భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్స్ మరియు కాటన్ వస్త్రాలు
HANDLOOM
INDIA
ఆంధ్రప్రదేశ్: ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి మరియు ఉప్పాడ, అస్సాం: మూగా & ఎరిశిల్క్స్, బీహార్: బాగల్పూర్ శిల్క్స్ & టస్సర్, ఛత్తీస్‌ఘడ్: ట్రిబల్ వర్క్స్ కోసా శిల్క్స్, గుజరాత్: బాందని, కచ్ఛ ఎంబ్రైడరీ డ్రెస్స్ & శారీస్, జమ్మూ & కాశ్మీర్: ఎంబ్రైడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్ & పాష్మిన్ శాల్, కర్ణాటక: క్రేప్ & ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, మధ్యప్రదేశ్: చందేరి, మహేశ్వరి, రాజస్థాన్: కోటా, బాందేజ్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, తెలంగాణ: గద్వాల్, నారాయణపేట & పోచంపల్లి, ఉత్తర్‌ప్రదేశ్: జమ్దాని & బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్, ✦ హరియాణ బెడ్‌కవర్లు & కుషన్ కవర్లు ✦ లక్నోవి, కుర్తీస & డ్రెస్ మెటీరియల్స్
COLOURFUL EXHIBITION
TIME: 10.30 AM TO 9.30 PM
☎ 9948194995
All Debit/ Credit Cards Accepted
TARA GARDEN FUNCTION HALL
BESIDE REC PETROL PUMP, MAIN ROAD, SUBEDARI, KAZIPET
7 DAYS ONLY

రహదారులు రక్తసిక్తం..

రహదారులు రక్తసిక్తమయ్యాయి.. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మృతి చెందారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద బైక్.. లారీ కిందికి దూసుకెళ్లిన ఘటనలో అన్నాచెల్లెలు, మరిపెడ మండలం కోమటికుంటా తండా సమీపంలో లారీని బైక్ ఢీకొనడంతో నవదంపతులు, మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామంలో బైక్.. ట్రాలీ ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, పర్వతగిరి మండలం వడ్లకొండ వద్ద బైక్.. మట్టిదిబ్బను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



తల్లిని చూడడానికి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లిన బైక్.
● అక్కడికక్కడే అన్నాచెల్లెలు మృతి



లారీకింద ఇరుక్కుపోయిన సుజిత్‌రెడ్డి,పూజితారెడ్డి

హసన్‌పర్తి : రెండు రోజులు సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి స్వగ్రామానికి వస్తున్న అన్నా చెల్లెలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజాత– దేవేందర్‌రెడ్డి దంపతులకు కుమారుడు సుజిత్‌రెడ్డి (27), పూజితారెడ్డి(24) ఉన్నారు. పూజితారెడ్డి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుండగా, సుజిత్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శని, ఆదివారాల్లో సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి బైక్‌పై నాగారం వస్తున్నారు.ఈ క్రమంలో బైక్.. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. దీంతో వారు అక్కడిక్కడే ప్రాణాలు వదిలారు.

అనాథ అయిన తల్లి.

కాగా, కొడుకు, కూతురు మృతి చెందడం, అంతకుముందే భర్తను కోల్పోవడంతో ప్రస్తుతం ఆ తల్లి అనాథ అయింది. కష్టాలు తీరుతాయని సంతోష పడిన తల్లికి మరిన్ని కష్టాలు తోడయ్యాయి. కొడుకు, కూతురు మృతదేహాలపై ఆ తల్లి పడి ఏడుస్తుండగా, అక్కడ ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

మట్టిదిబ్బను ఢీకొని..



రాజు మృతదేహం

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్లకొండ, ఉప్పరపల్లి గ్రామాల మధ్యలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం వడ్లకొండకు చెందిన తాటికాయల రాజు కుటుంబ సభ్యులతో కలిసి అనంతారంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి పని నిమిత్తం వడ్లకొండకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అనంతరం రాజు ఎంతకూ ఇంటికి రాలేదు. దీంతో అతని తమ్ముడు నవీన్, కొడుకు రవితేజ.. రాజు ఆచూకీ కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వడ్లకొండ, ఉప్పరపల్లికి దారిలో రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బను గుద్దుకుని కిందపడి ఉన్నాడు. గమనించిన వారు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే రాజు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో, బైక్ ఢీ..

● ఇద్దరి మృత్యువాత



సమ్మక్క, అశోక్ మృతదేహాలు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కొర్లకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన చేరాల అశోక్ ద్విచక్ర వాహనంపై మహాముత్తారం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారులోని అలుగు వాగు సమీపంలో గోదావరిఖని నుంచి మంగోపేటకు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో ట్రాలీ ఆటోలో ముందు భాగంలో కూర్చున్న చిల్ల సమ్మక్కతో పాటు అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాటారం సీఐ రంజిత్‌రావు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు చిల్ల పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లయిన మూడు నెలలకే కబళించిన మృత్యువు..

● బైక్, లారీ ఢీ
● దంపతులు మృతి



నారాయణ సింగ్,అంజలి మృతదేహాలు

మరిపెడ రూరల్ : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో నవ దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు. కాగా, పెళ్లయిన మూడు నెలలకే దంపతులను లారీ రూపంలో మృత్యువు కబలించింది. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మరిపెడ మండల కేంద్రం పూలబజార్‌కు చెందిన అంజలి (21)కి జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చెల్లగరిగెకు చెందిన తునగర్ నారాయణసింగ్ (23)కు గత మార్చి 9న వివాహం జరిగింది. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీకెండ్ కావడంతో దంపతులు బైక్‌పై అత్తగారింటికి వస్తుండగా మరిపెడ మండలం కోమటికుంటతండా సమీపంలో ఎదురుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు.

'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షల'పై ఎఫ్ఐఆర్

● మధ్యవర్తిత్వం చేసిన 12 మందిపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, వరంగల్: 'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షలు' శీర్షిన సాక్షి ప్రధాన సంచికలో ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా పరిగణించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పోక్సో కేసు నీరుగార్చేలా మధ్యవర్తిత్వం చేసిన 12 మంది పెద్దలపై 195 (ఏ) రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఓ బాలికను నర్సంపేటకు చెందిన యువకుడు ప్రేమపేరుతో మోసం చేయడంతో అతనిపై 2022 ఆగస్టు 14న నమోదైన పోక్సో కేసు కోర్టులో కొట్టుడుపోయే విధంగా సహకరించాలంటూ పెద్దలు ఒత్తిడి తీసుకురావడంతో ఇష్టం లేని బాధితురాలు సీపీ రంగనాథ్‌ను గత గురువారం మరోమారు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అప్పటికే సాక్షిలో వచ్చిన కథనంతో మధ్యవర్తుల వివరాలు సేకరించిన ప్రత్యేక ఎస్‌బీ బృందం సీపీ కార్యాలయానికి తీసుకొచ్చి మరీ విచారించారు. ఈశ్వర్ సింగ్, అనిల్, మందకుమార్, జైపాల్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందన, నిరంజన్‌రెడ్డి, సూరయ్య, చల్లామల్లారెడ్డి, శారద, కొమ్మాలు, లక్‌పతిలపై నర్సంపేట టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఉందా, ఉంటే ఎవరూ ఉన్నారనే దిశగానూ ఎస్బీ బృందాలు ఇప్పటికే విచారణ ముమ్మరం చేసినట్టు తెలిసింది.

నర్సంపేట ఏసీపీ ఆఫీసు ఎదురుగానే పంచాయితీ



నర్సంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు.. ఓ తండాకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఆ తర్వాత మొహం చాటేయడంతో మోసపోయానని తెలుసుకున్న సదరు బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ వివాదాన్ని పెద్దల ముందు తీసుకెళితే పరిహారం ఇవ్వాలని నర్సంపేట ఏసీపీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఎంపీడీఓ ఆఫీసులో జరిగిన పంచాయితీలో నిర్ణయించి రూ.13లక్షలకు తీర్మానం చేశారు. రూ.ఐదు లక్షలు తల్లి శారదకు ఇచ్చి అదే నగదును నర్సంపేటలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌లో చందన, మల్లారెడ్డి పేర్ల మీద ఉన్న జాయింట్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిర్యాదురాలు డబ్బు తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడంతో కోర్టు ద్వారా తనకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

తెలంగాణ అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం..



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం క్రాస్‌లోని వీఆర్‌గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ప్రతీ ఇంట్లో సంక్షేమం.. ప్రతీ ముఖంలో సంతోషం' అనే కోణంలో సీఎం కేసీఆర్ పని చేస్తున్నట్లు చెప్పారు. రూ. 60వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ చెక్కులు, బీసీ కులాలకు రూ.లక్ష చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్స కోట, డీఆర్‌డీఓ పీడీ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అని మిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, బిల్లా సుధీర్‌రెడ్డి, నర్సింహానాయక్, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

● రవాణా శాఖ ఉప కమిషనర్ పురుషోత్తం



విలేజీ బస్ ఆఫీసర్స్ మార్గదర్శకాల బుక్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ, ఏసీపీ, ఆర్ఎం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం హనుమకొండ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేజీ బస్ ఆఫీసర్స్ విధులను ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం జె.శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలేజీ బస్ ఆఫీసర్స్ నియామకంతో సంస్థకు మేలు చేకూరుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, డీఎంలు జి.సురేశ్, బాబు నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నర్సంపేట

● మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

నర్సంపేట: సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేటను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతం సాగునీటితో సస్యశ్యామలంగా మారిందన్నారు. నర్సంపేట అభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ ఇరిగేషన్ సర్క్యూట్ నర్సంపేటకు జలహారం అన్నారు. నర్సంపేట దిక్కులా రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గతంలో పది వేల మంది లబ్ధిదారులకు రూ.135కోట్లతో గొర్రెల పంపిణీ చేశామని, మిగితా వారికి త్వరలో రెండో దఫా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ రామస్వామి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌బీఎస్ రాష్ట్ర బాధ్యులు రాయిడి రవీందర్‌రెడ్డి, ఏసీపీ సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రివర్స్ వస్తూ బావిలో పడిన ట్రాక్టర్..

● డ్రైవర్ దుర్మరణం
● లింగాపురం అలుముకున్న విషాదఛాయలు



కీమ (ఫైల్)

చెన్నారావుపేట: ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న క్రమంలో బావిలో పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లింగాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాపురం శివారు మేఘ్యా తండాకు చెందిన అజ్మీరా కీమ (45) అదే తండాకు చెందిన అజ్మీరా శ్రీను ట్రాక్టర్‌ను తీసుకుని బానోత్ రవి అనే కౌలు రైతుకు చెందిన చెలక దున్నడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. చెలక దున్నతున్న క్రమంలో రివర్స్ తీస్తూ వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పడ్డాడు. దీంతో కీమ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై తోట మహేందర్ ఘటనా స్థలికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఆత్మకూరు : వడదెబ్బతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోపిరెడ్డి లక్ష్మీనారాయణ (65)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న సొప్ప శుభ్రం చేస్తుండగా వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురై ఒకసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొత్తదుబ్బతండాలో ..



హేమ్లా(ఫైల్)

డోర్నకల్: వడదెబ్బతో మండలంలోని కొత్తదుబ్బతండాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. తండాకు చెందిన ధారావత్ హేమ్లా(83) శుక్రవారం మున్నేరువాగు వద్దకు మేకలను మేతకు తీసుకెళ్లాడు. మండుతున్న ఎండకు అస్వస్థతకు గురై వాగు సమీపంలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి

● ముల్కనూర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి
● వరంగల్ ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు ప్రారంభం

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ములుకనూరు సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అసోచం ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగనున్న టీఎస్ అగ్రిటెక్ రైతు సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అసోచం అడిషనల్ డైరెక్టర్ దినేశ్ అధ్యక్షత వహించగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం కోసం రైతులు మారుతున్న కాలానికనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. వరంగల్ ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు.అలాగే, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉండాలన్నారు. మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దని సూచించారు. కోరమండల్ జీపీ సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త బలరాం, జేడీఏ ఉషాదయాల్, డీఏవో రవీందర్ పాల్గొన్నారు.

పేరుకు కౌలు.. చేసేది నకిలీ విత్తన దందా..



● పల్నాడు టు కామారెడ్డిగూడెం..
● నకిలీ విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు
● పోలీసులకు అప్పగింత



కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు

దేవరుప్పుల: వ్యవసాయ భూముల కౌలు పేరిట వలస వచ్చిన ఆంధ్రాకు చెందిన రైతులు ఇక్కడి రైతులను నమ్మబలుకుతున్నారు. అనంతరం నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డిగూడెంలో వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుకు చెందిన చందుపాటు రామారావు మండలంలోని కామారెడ్డిగూడెంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో ఇక్కడి రైతులతో సన్నిహిత్యం పెంచుకొని పలు పేరుమోసిన కంపెనీల నుంచి ప్యాకింగ్ అయ్యే వచ్చే విత్తనాలు ఇవే నని నమ్మబలికి దేవరుప్పుల, కామారెడ్డిగూడెంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆంధ్రాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తిలో తీసిన విత్తనాలను శుద్ధి చేసి ఇక్కడ రంగులద్ది కిలో రూ. వేయి చొప్పున విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వ్యవసాయ అధికారులు కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలతో ఉన్న చందుపాటి రామరావుతోపాటు స్థానికుడు మరాటి యాదిగిరిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ పరశురామ్‌నాయక్, ఇన్‌చార్జి ఏఓ రాజు, ఏఈఓ సాగర్, హెచ్‌సీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న మైనర్‌తోపాటు ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. వారినుంచి రూ.2.75 లక్షల విలువగల మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాల్‌నగర్ చెందిన బాలుడితోపాటు విసునూటి రవీందర్ అలియాస్ బబ్లూ, అలుగు నరసింహారావులు జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నారు. బాలుడు గతంలో పద్మాక్షి దేవాలయంలో హుండీ పగులగొట్టి డబ్బుల చోరీకి పాల్పడ్డాడు.. నిందితులు హనుమకొండ, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీచేశారు. గత నెల 20న ములుగు జిల్లా , గోవిందారావుపేట మండలం మచ్చాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డుపక్కన పడేసిన బైక్‌ను అపహరించారు. వీరిని శుక్రవారం హంటర్‌రోడ్డులోని రాజ్ హోటల్ పరిసరాలలో అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE
■ ఒగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కు ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ।।గ।। ప్లాటు అమ్మబడును. సంప్ర।। 9849544437. [W-785590]

HOUSE FOR SALE
■ GWMC అప్రూవ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు 4BHK డూప్లెక్స్ హౌస్ 3BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. శ్రీనివాస్. సెల్: 8978638094. [W-785601]

SERVICES

LOANS
■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785592]
■ సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర।। JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

HOTEL FOR SALE
■ Hotel For Sale in Goa at Calangute Beach. 29 Rooms with Swimming Pool, Bar & Restaurant, Spa. Price 35Cr. Call: 9881931111, Broker Excuse. [HA-29536]

WANTED
■ Nurses, GNM, ఫార్మసిస్ట్స్, (Male) సూపర్‌వైజర్స్ కావలెను. సంప్ర।। గార్డియన్ హాస్పిటల్, Opp: L.B. కాలేజి, ములుగు "X" రోడ్ వరంగల్, 12 to 2 PM. [WA-0232]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।।లు మాత్రమే 5% GST అదనము

■ ప్రముఖ బుక్స్ పబ్లికేషన్‌లో పనిచేయుటకు లేడీ స్కూల్ విజిటింగ్ రిసోర్స్ పర్సన్ కావలెను. WGL, HNK, KZP, Parakal. Female Degree with English / Willing to Travel. Cell: 9676591600. [W-785586]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 9573633520, 9059633520. [M-1221311]
■ సూపర్‌వైజర్లు, హెల్పర్లు, హౌస్ కీపింగ్ బాయ్స్, రైల్వే స్టేషన్, హోటల్, ఆఫీసుల్లో క్లీనింగ్ వర్కర్స్ కావలెను. బయోడేటా వాట్సాప్ చేసి ఫోన్ చేయండి. RSR. Cell : 77029 59468 [V- 1935]
■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటివద్ద పనిచేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన, నిరుద్యోగులు, గృహిణులు. అర్హత 10th Above, 18+ అందరూ అర్హులే. ఫోన్: 6374132938 [V-794625]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.